సాక్షి పెద్దపల్లి

బుధవారం । 1 । ఫిబ్రవరి । 2023



సమ్మక్క జాతరకు ముస్తాబు

రామగుండం: గోలివాడ గోదావరి నది ఒడ్డున బుధవారం నుంచి జరిగే మినీ సమ్మక్క జాతరకు ఏర్పాట్లు చేశారు. గద్దెలను శుభ్రం చేశామని, తాగునీరు కల్పించామని జాతర కమిటీ చైర్మన్ గీట్ల శంకర్‌రెడ్డి తెలిపారు.



సీఎస్‌ను కలిసిన ఎమ్మెల్యే

గోదావరిఖని: అంతర్గాం మండలం రాయదండిలో కురుజుకమ్మి భూములకు పట్టాలు ఇవ్వాలని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ శాంతికుమారిని కోరారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 32.0/20.0

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉంటాయి. సాయంత్రం చలితీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

ఎన్టీపీసీలో 1,352 మి.యూ విద్యుత్ ఉత్పత్తి



ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం సంస్థ జనవరిలో 1,352 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తిని 81.44 శాతం (పీఎల్ఎఫ్) ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్‌గా పూర్తి చేసింది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో 12,874 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని 67.38 శాతం పీఎల్ఎఫ్ సాధించింది. 2600 మెగావాట్ల విద్యుత్ పరిశ్రమలో ప్రస్తుతం 50.12 శాతం ఫ్రీక్వెన్సీతో 1867 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతున్నట్లు సమాచారం. 200 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం గల మొదటి యూనిట్‌లో 193, మూడో యూనిట్‌లో190 మి.యూ, 500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల నాలుగో యూనిట్‌లో489, ఐదో యూనిట్‌లో 497, ఏడో యూనిట్‌లో 498 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతున్నట్లు అధికారులు తెలిపారు.

చీడపీడల నివారణపై అవగాహన



కాల్వశ్రీరాంపూర్‌లో పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పలు గ్రామాల్లో సాగవుతున్న వరి పొలాలను మంగళవారం వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశీలించారు. ముందుగా నాట్లు వేసిన వరికి మొగి పురుగు ఆశించి.. మొవ్వలు కుళ్లిపోయాయని, అలాంటి సమయంలో వ్యవసాయ అధికారులను సంప్రదించి రోగ లక్షణాలు తెలుసుకుని నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే పురుగు మందులపై రైతులకు అవగాహన కల్పించారు. యూరియా తక్కువ మోతాదులో వేసుకోవాలన్నారు. మొగిపురుగు నివారణకు క్లోరంట్రిప్రోల్ 60 ఎంఎల్ లేదా క్లోరంత్రిపోల్ ప్లస్ లంబ్డాసిహాలోత్రిన్ కలిసి ఉన్న మందు 80 ఎంఎల్ నీటిలో కలుపుకుని పిచికారీ చేయాలన్నారు. క్లోరంట్రిప్రోల్ గుళికలను ఎకరానికి నాలుగు కిలోలు వేయాలని, కార్టాఫ్‌హైడ్రోక్లోరైడ్ రెండు గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. రామగిరి ఖిల్లా శాస్త్రవేత్తలు వెంకన్న, కిరణ్, ఏడీఏ శ్రీనాథ్, ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్, సర్పంచు శ్రీదేవి, ఏవో నాగార్జున, ఏఎంసీ మాజీ చైర్మన్ రాంచంద్రా రెడ్డి, ఏఈవోలు రమేశ్, శ్రీనివాస్ రెడ్డి, పూర్ణచందర్, రైతులు పాల్గొన్నారు.

ఓదెలలో..

ఓదెల: మండలంలోని నాంసానిపల్లె గ్రామంలో కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పర్యటించి వరి పొలాలను పరిశీలించారు. వరికి మొగి పురుగు, మొక్కజొన్నకు ఎండుతెగులు సోకినట్లు గుర్తించారు. వీటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరించారు.

విద్యార్థులు ప్రయోజకులు కావాలి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్

మంథని: విద్యార్థులు ప్రయోజకులుగా ఎదగాలన్నదే తమ ఆకాంక్ష అని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. మంథని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పుట్ట లింగమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాస అభివృద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏళ్ల క్రితమే మంథనికి ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరైతే కాంగ్రెస్ నాయకులు యాభై ఏళ్లు నిర్లక్ష్యం చేశారని, తాను మాత్రం నాలుగున్నరేళ్లలోనే భవనాలు పూర్తి చేశానని గుర్తు చేశారు. కళాశాలలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని, సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని సూచించారు. మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ, ప్రిన్సిపల్ సయ్యద్ సలీం, ఎంపీపీ కొండ శంకర్, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, రైతుబంధు అధ్యక్షుడు ఆకుల కిరణ్, నాయకులు జక్కు రాకేశ్, మంథని లక్ష్మణ్, పూదరి సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

పత్తి క్వింటాల్‌కు రూ.7,861

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌లో పత్తి క్వింటాల్‌కు మంగళవారం రూ.7,861 పలికింది. కనిష్ఠంగా రూ.7,001, సరాసరి రూ.7,761గా నమోదైనట్లు ప్రత్యేక శ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ తెలిపారు.

కత్తులు దూస్తున్నారు..!

- పారిశ్రామిక ప్రాంతంలో పేట్రేగుతున్న రౌడీషీటర్లు
- సుమన్ హత్యతో మరింత భయాందోళన
- అంతిమయాత్రలో తల్వార్లతో రౌడీమూకలు
- ప్రతీకారం తీర్చుకుంటామంటూ నినాదాలు
- కమిషనరేట్ సమీపంలోనే విచ్చలవిడి ప్రదర్శన
- పోలీసుల వైఫల్యంపై సర్వత్రా విమర్శలు



సుమన్ అంతిమయాత్రలో తల్వార్లతో జులాయిల ప్రదర్శన

సాక్షి, పెద్దపల్లి/గోదావరిఖని: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో రౌడీమూకల ఆగడాలు మితిమీరుతున్నా.. ప్రజల పట్ల వారి వ్యవహార శైలి కంట్రోల్ తప్పుతున్నా.. పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారా..? అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. మూడు రోజుల క్రితం దారుణహత్యకు గురైన సుమన్ అంతిమయాత్రలో జులాయిల ప్రవర్తనే ఇందుకు సాక్ష్యంగా నిలుస్తోంది. రామగుండం పారిశ్రామిక ప్రాంతం కావడం.. వివిధ ప్రాంతాల వారు ఇక్కడ నివసిస్తుండడంతో శాంతిభద్రతలు అదుపు తప్పేవి. ఈ క్రమంలో వాటిని పూర్తిస్థాయిలో అదుపులో పెట్టాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రామగుండంలో కమిషనరేట్ ఏర్పాటు చేసింది.

మళ్లీ హత్యల సంస్కృతి..

పారిశ్రామిక ప్రాంతంలో రెండు దశాబ్దాల క్రితం ఉన్న హత్యల సంస్కృతి మళ్లీ తెరపైకి వచ్చింది. ప్రతిఒక్కరిలోనూ ప్రతీకారేచ్ఛ రగులుతోంది. హత్యకుహత్యే అన్నట్లు కొందరు వ్యవహరిస్తున్నారు. మూడు రోజుల క్రితం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో దారుణ హత్యకు గురైన సుమన్ ఘటన ఇందుకు ఉదాహరణగా నిలుస్తోంది. ఈ సంఘటనలో పోలీసులు వ్యవహరించిన తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దనాల శివకుమార్ హత్యకు ప్రతీకారంగా అతడి అన్న మరో వ్యక్తికి సుపారీ ఇచ్చి వేట కత్తులతో సుమన్‌ను నరికి చంపారు. అయితే సుమన్ అంత్యక్రియల్లో పాల్గొన్న కొందరు యువకులు అతిగా ప్రవర్తించి వారి నేరప్రవృత్తిని బయటపెట్టుకున్నారు. పోలీసులు వద్దంటున్నా.. వారి సూచనలు ఏమాత్రమూ పట్టించుకోకుండా తల్వార్లు ప్రదర్శించడం చర్చకు దారితీసింది. చౌరస్తా వద్ద సుమన్ మృతదేహాన్ని వాహనంలో ఎక్కించి గోదావరితీరానికి తరలించాలని పోలీసులు పట్టుబట్టగా.. అక్కడున్న యువకులు పోలీసుల మాట వినకుండా శవాన్ని మోసుకుంటూ తీసుకెళ్లారు. సుమన్ హత్యకేసులో ప్రధాన నిందితులుగా అనుమానిస్తున్న వారి ఇళ్లు కూడా అటువైపే ఉండటంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేయాల్సి వచ్చింది. పరిస్థితి అదుపు తప్పడంతో అంతిమయాత్రలో పాల్గొన్న వారిపై పోలీసులు లాఠీచార్జి చేయాల్సి వచ్చింది. గతంలో హత్యకు గురైన శివకుమార్, రెండు రోజుల క్రితం దారుణ హత్యకు గురైన సుమన్ ఇద్దరిదీ నేరచరిత్ర అయినప్పటికీ జరిగిన సంఘటన తీరు పోలీస్‌శాఖను వెక్కిరిస్తోంది.

ప్రతీకారంతో..

దనాల శివకుమార్ హత్య కేసులో సుమన్ పాత్రధారి కావడంతో శివకుమార్ బంధువులే హతమార్చినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు సుమన్‌ను హత్యచేసిన వారిపై ప్రతీకారం తీర్చుకుంటామని అతడి అంతిమయాత్రలో పాల్గొన్న యువకులు నినాదాలు చేయడం ఇక్కడి పరిస్థితి తీరుకు అద్దం పడుతోంది. శివకుమార్ హత్య ఘటనలో జైలుకు వెళ్లి వచ్చిన సుమన్‌పై రెక్కీ పెట్టినట్లు కూడా తెలుస్తోంది. సుమన్‌ను ఎలాగైనా హతమార్చాలనే ఆలోచనతో జైలులో తనకు పరిచయం అయిన మరో నిందితుడి ద్వారా పథకం రచించి.. ప్రధాన చౌరస్తాలో అత్యంత పాశవికంగా కత్తులతో నరికి చంపడంపై ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. నిరంతరం పోలీసుల భద్రత, సీసీ కెమెరాల నిఘా ఉన్నప్పటికీ దారుణ హత్య జరగడం పోలీసులను కలవరపెడుతోంది. మరోవైపు ప్రతీకారం తీర్చుకుంటామని యువకులు నినాదాలు చేయడం చూస్తే.. ప్రతీకారేచ్ఛ ఇంకెంతకాలం కొనసాగుతుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రౌడీషీటర్లను ప్రతినెలా పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి హెచ్చరిస్తున్నా.. ఇలాంటి సంఘటన జరగడంతో పోలీసుల తీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎవరినీ ఉపేక్షించం

ప్రజలను ఇబ్బంది పెడితే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతున్నాం. ఆ దిశగా రాత్రివేళ పెట్రోలింగ్ సైతం ముమ్మరం చేశాం. తల్వార్‌లు ప్రదర్శించిన వారిపై ఇప్పటికే కేసులు నమోదు చేశాం.

– గిరిప్రసాద్, ఏసీపీ గోదావరిఖని

తల్వార్ల విన్యాసంపై పోలీసుల సీరియస్..

సుమన్ అంతిమ యాత్రలో పోలీసుల సమక్షంలోనే తల్వార్లతో కొందరు విన్యాసాలు చేసిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అయితే భారీ సంఖ్యలో యువకులు హత్య జరిగిన ప్రధానచౌరస్తాలో గుమికూడటం, పోలీసుల సూచనలు కూడా లెక్కచేయకపోవడంపై పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరించినట్లు తెలుస్తోంది. వారిని అప్పుడే కట్టడి చేయకుండా.. కత్తులతో విన్యాసాలు చేసిన వారిని వీడియో పుటేజీల ద్వారా గుర్తించి అదుపులో తీసుకుని కేసు నమోదు చేశారు.

పోలీసుల అదుపులో నిందితులు..?

హత్యకేసులో ప్రధాన నిందితుడితోపాటు సుపారీ తీసుకుని ఘటనలో పాల్గొన్న మరో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. హత్యకు ఎప్పటి నుంచి పథకం పన్నారు..? దీని వెనకాల ఎవరెవరున్నారు..? సుపారీ ఎంత తీసుకున్నారు..? అనే అంశాలపై పోలీసులు కూపీ లాగుతున్నట్లు తెలుస్తోంది. నిందితులను రామగుండం కమిషనరేట్ పరిధిలోని ఓ పోలీస్‌స్టేషన్‌లో ఉంచి విచారణ చేస్తున్నట్లు సమాచారం.

భూసారం ఉంటేనే

అధిక దిగుబడి..!

- పంటమార్పిడి విధానం మేలు
- వరి సాగుకే జిల్లారైతుల మొగ్గు
- మొగి పురుగు ఉధృతిని కట్టడి చేస్తున్నాం
- కల్తీ విత్తనాలు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు
- రైతువేదికల ద్వారా అన్నదాతలకు సూచనలు



'సాక్షి' ఇంటర్వ్యూలో జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి

పెద్దపల్లిరూరల్: పంటలు సాగు చేస్తున్న రైతులు భూములను సారవంతం చేసుకోవడంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, పచ్చిరొట్టతో భూసారం పెంచుకోవాలని, మోతాదు మించి రసాయనాలు వాడొద్దన్నారు జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి. కల్తీ విత్తనాలు మార్కెట్‌లోకి రాకుండా సీజన్ సమయంలో గట్టి నిఘా ఉంచామన్నారు. యాసంగిలో వరి పంటకు మొగి పురుగు ఉధృతి కొంత ఎక్కువగానే ఉందని, నియంత్రించేందుకు శాస్త్రవేత్తలతో కలిసి పంటలను పరిశీలిస్తున్నామని వివరించారు. రైతుబంధు, రైతుబీమా, రైతువేదికల ద్వారా అన్నదాతలకు అందుతున్న సేవలపై మంగళవారం 'సాక్షి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు.

సాక్షి: జిల్లాలో పంటల సాగు ఎలా ఉంది..?

డీఏఓ: వరి 1.90లక్షల ఎకరాల్లో సాగైంది. మరో ఐదువేల ఎకరాల్లో సాగు కావొచ్చు. మొక్కజొన్న 10వేల ఎకరాల్లో సాగైంది. పప్పు దినుసుల సాగు గణనీయంగా తగ్గింది.

సాక్షి: ఆయిల్ పాం సాగు ఎలా ఉంది..?

డీఏఓ: జిల్లాలో 2600 ఎకరాల్లో ఆయిల్ పాం సాగు చేయాలని లక్ష్యంగా ఎంచుకున్నాం. ఇప్పటివరకు 1100 ఎకరాల్లో పూర్తయింది. మరో 700 ఎకరాలకు డీడీలు అందాయి. మిగతా 800 ఎకరాలకు రైతులను గుర్తించాం.

సాక్షి: వరిలో మొగి పురుగు వైరస్ కట్టడికి చర్యలేంటీ..?

డీఏఓ: వరి కోతలు పూర్తయిన వెంటనే నారుపోయడం మొగిపురుగు ఉధృతికి కారణం. వైరస్‌ను తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నం. శాస్త్రవేత్తలతో రైతులకు సూచనలిప్పిస్తున్నాం. వ్యవసాయ సిబ్బంది నిత్యం తిరుగుతున్నారు.

సాక్షి: ఎరువులు అందుబాటులో ఉన్నాయా...?

డీఏఓ: జిల్లా రైతులకు అవసరమైనన్ని ఎరువులు అందుబాటులో ఉన్నాయి. కాంప్లెక్స్ ఎరువుల వాడకం దాదాపు పూర్తయింది. 29వేల టన్నుల యూరియా నిల్వ ఉంది.

సాక్షి: కల్తీ, నకిలీ విత్తన అమ్మకాలపై..?

డీఏఓ: సీజన్‌లో కల్తీ, నకిలీ విత్తనాలను విక్రయించే వారిని గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. ఖిలావనపర్తిలో విత్తనాలను వినియోగించి నష్టపోయిన రైతుకు పరిహారం ఇప్పించాం.

సాక్షి: యాంత్రీకరణ పనిముట్లు అందిస్తున్నారా..?

డీఏఓ: లేదు.. నాలుగేళ్లుగా వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు అందడం లేదు. దాదాపు ఆ ప్రక్రియ ఆగిపోయినట్టే. ప్రభుత్వం నుంచి ఆదేశాలందితే అమలు చేస్తాం.

సాక్షి: రైతువేదికల నిర్వహణ ఎలా ఉంది..?

డీఏఓ: జిల్లాలోని 54 క్లస్టర్లలో రైతువేదికలున్నాయి. వాటినిర్వహణకు ప్రతినెలా రూ.9వేలు ప్రభుత్వం అందిస్తోంది. రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఆ వేదికల నుంచే అందిస్తున్నారు.

సాక్షి: భూసార పరీక్షలు నిర్వహిస్తున్నారా...?

డీఏఓ: ప్రతి క్లస్టర్‌కు మినీ కిట్లు అందించారు. పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన రసాయనాలు ఇవ్వడం లేదు. ఆసక్తి ఉన్న రైతులు నమూనాలు ఇస్తే వాటిని కరీంనగర్ ల్యాబ్ పంపించి రిపోర్ట్ వచ్చాక రైతులకు అందిస్తున్నాం.

సాక్షి: వ్యాపారులందరికీ లైసెన్సులు ఉన్నాయా..?

డీఏఓ: లైసెన్స్ లేకుండా వ్యాపారం చేసే వారిపై చర్యలుంటాయి. ఇపుడు లైసెన్స్ జారీ విధానం ఆన్‌లైన్‌లో సులువుగా జరుగుతోంది.

సాక్షి: రైతుబంధు, బీమా అందరికీ అందుతున్నాయా..?

డీఏఓ: జిల్లాలో మరణించిన 186మంది రైతుల్లో 174మంది కుటుంబాలకు పరిహారం అందించాం. మరో 14 మంది కుటుంబాలకు రావాల్సి ఉంది. రైతుబంధు మరో 12వేల మంది (8ఎకరాలకు పైబడి) ఉన్న రైతులకు రావాల్సి ఉంది.

సాక్షి: అధికారులు, సిబ్బంది ఉన్నారా..?

డీఏఓ: జిలాలోని 14 మండలాల్లో 12మంది ఏఓలు ఉన్నారు. పాలకుర్తి, ఓదెలకు ఇన్‌చార్జిలు ఉన్నారు. 54 మంది ఏఈఓలకు 49 మంది ఉన్నారు. మిగతా ఐదుగురిని ఔట్‌సోర్సింగ్ పద్ధతిన నియమించాం.

సీపీఎస్ యాక్టివిటీలో రామగుండం నంబర్ వన్

- వందకు వంద మార్కులు సాధించిన బల్దియా



సిబ్బందిని అభినందిస్తున్న కమిషనర్ సుమన్‌రావు

కోల్‌సిటీ: అర్బన్ అవుట్ కమ్ ఫ్రేమ్ వర్క్స్‌లో భాగంగా ఈజ్ ఆఫ్ లివింగ్ ఇండెక్స్ రూపొందించేందుకు కేంద్రం నిర్వహించిన సిటిజన్ పర్సెప్షన్ సర్వే యాక్టివిటీలో రామగుండం కార్పొరేషన్ వందకువంద మార్కులు సాధించింది. సిటీ లెవెల్ బోర్డ్ ఫర్ సీపీఎస్ యాక్టివిటీస్– 2022 పేరిట కేంద్ర గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల శాఖ జనవరి 30న జాబితా విడుదల చేసింది. ఇందులో వందకు వంద మార్కులు సాధించిన నగరాల్లో రాష్ట్రంలో రామగుండానికి మాత్రమే చోటుదక్కింది. ఈజ్ ఆఫ్ లివింగ్ ఇండెక్స్‌లో భాగంగా నగరంలో జీవన నాణ్యతపై పౌరుల అవగాహన, అభిప్రాయాన్ని అర్థం చేసుకోవడానికి సహాయ పడుతుందని కేంద్ర గృహనిర్మాణం, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఈ సిటిజన్ పర్సెప్షన్ సర్వే నిర్వహిస్తున్నారు.

వందకువంద

సర్వేలో భాగంగా ప్రచార అవగాహనకు బోర్డ్‌లు, హోర్డింగ్‌ల ఏర్పాటుకు 10 మార్కులు, కుడ్య చిత్రాలకు 20, క్యాంపెయిన్‌కు 10, రిఫరల్ సర్వే ప్రమోషన్‌కు 20, ప్రింట్‌మీడియా ద్వారా అవగాహనకు 10, డిజిటల్ మీడియా అవగాహనకు 10, ఇన్నోవేటివ్ ఇన్సియేటివ్‌కు 20 మార్కుల చొప్పున 100 మార్కులు ఉంటాయి. అయితే అన్ని విభాగాల్లో కార్పొరేషన్ వందశాతం మార్కులు సాధించింది.

స్మార్ట్‌సిటీల సరసన రామగుండం

స్మార్ట్‌సిటీలుగా గుర్తించిన నగరాలే ఎక్కువగా ఈ జాబితాలో చోటు సంపాదించాయి. రామగుండం స్మార్ట్‌సిటీ కాకున్నా వాటి సరసన నిలిచింది. నోడల్ అధికారి, డిప్యూటీ కమిషనర్ నారాయణరావు, సిబ్బంది శ్రవణ్, శ్రీకాంత్, మధు, అరుణ్, వంశీని మేయర్ అనిల్, కమిషనర్ అభినందించారు.

మోడల్ స్కూళ్లను ప్రారంభానికి సిద్ధం చేయండి



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ సంగీత

కమాన్‌పూర్: మండలంలో మనఊరు–మనబడి కింద ఎంపిక చేసిన మోడల్ పాఠశాలల్లో పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని కలెక్టర్ సంగీత అన్నారు. రొంపికుంట, గుండారం పాఠశాలలను మంగళవారం పరిశీలించారు. పాఠశాలలో పచ్చదనం పెరిగేలా మొక్కలు నాటి పాఠశాలల పేరుతో బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. గుండారం పాఠశాలకు మంజూరైన నిధులతో వంద శాతం పనులు పూర్తి చేయడంతో పాటు గ్రీన్ నర్సరీని ఏర్పాటు చేయడం, గ్రామపంచాయితీకి ఆదాయం సమకూర్చుకునేందుకు రెండెకరాల ప్రభుత్వ భూమిలో ఆయిల్ పాం సాగు చేస్తున్న సర్పంచ్ ఆకుల ఓదెలు, ఎంపీడీవో విజయ్‌కుమార్‌ను అభినందించారు. ఎంపీపీ రాసకొండ లక్ష్మి, తహసీల్దార్ ప్రసాదరావు, సర్పంచ్ కట్కం రవీందర్ ఎంఈవో సంపత్‌రావు, డీఈ విలాస్, ఏఈ నరేశ్ ఉన్నారు. అంతకుముందు గుండారం శివారులోని అసైన్డ్ భూములు సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాదార్ పాస్‌బుక్కులు ఇప్పించాలని సర్పంచ్ ఆకుల ఓదెలు కలెక్టర్‌ను కోరారు.

కంటివెలుగుపై నిర్లక్ష్యం వద్దు

రామగిరి: కంటి వెలుగు కార్యక్రమంపై నిర్లక్ష్యం వద్దని కలెక్టర్ సంగీత స్పష్టం చేశారు. మండలంలోని రాజాపూర్‌లో కొనసాగుతున్న కంటివెలుగు కార్యక్రమాన్ని మంగళవారం సందర్శించారు. ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. రోజువారి రిపోర్ట్‌ను నిర్ణీత గడువులోగా తనకు పంపించాలన్నారు. ఎంపీపీ ఆరెల్లి దేవక్క, సర్పంచ్ పాశం ఓదెలు, ఎంపీడీఓ రమేశ్, ఎంపీఓ కాటం భాస్కర్, డాక్టర్ హిమబిందు, హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మి, ఆప్తాల్మిక్ ప్రవళిక పాల్గొన్నారు.


కరెంట్ 'కోత'లే..!



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు ఆసంపల్లి ఆనందం. పెద్దపల్లి మండలం నిట్టూరు గ్రామం. ఈయనకున్న మూడెకరాల్లో వరి సాగు చేస్తున్నాడు. వారం రోజులుగా కరెంట్ ఎప్పుడొస్తుందో..? ఎపుడు పోతుందో తెలియక అయోమయానికి గురవుతున్నాడు. పంట ఎండిపోయే ప్రమాదముందని ఆందోళన చెందుతున్నాడు.

- అధికారులు, అన్నదాతల్లో అయోమయం
- ఎప్పుడొస్తుందో సిబ్బందికే తెలియని వైనం
- నీరందక ఎండిపోయే ప్రమాదం
- ఎస్ఈ ఆఫీస్‌లో కాల్‌సెంటర్ నంబరు 79016 28367

జిల్లా సమాచారం	
వ్యవసాయ కనెక్షన్లు	72,678
సాగైన వరి (ఎకరాల్లో)	1,31,969
మొక్కజొన్న(ఎకరాల్లో)	5,367
బోరుబావులు	24,172
బావులు	43,049



పెద్దపల్లిరూరల్: ఈ బాధ ఆనందం ఒక్కడిదే కాదు.. జిల్లావ్యాప్తంగా పంటలు సాగు చేసిన రైతులందరిదీ. వారం రోజులుగా ఇదే రీతిన ఆందోళన చెందుతున్నారు. కరెంట్ ఎప్పుడొస్తుందనే విషయం ఆ శాఖ అధికారులకే తెలియడం లేదు. రైతులు అడిగిన ప్రశ్నలకు స్థానికంగా ఉన్న సిబ్బంది సమాధానం చెప్పలేక సతమతమవుతుండడమే ఇందుకు నిదర్శనం.

వరి పంటపైనే ప్రభావమెక్కువ..

జిల్లాలో 1,37,433 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. అందులో వరి 1,31,969 ఎకరాల్లో సాగైంది. 5,367 ఎకరాల్లో మొక్కజొన్న, మిగతా భూమిలో ఇతర పంటలు సాగుచేసినట్లు అధికారులు చెబుతున్నారు. వరికి మొగిపురుగు సోకడంతో దానిని నివారించేందుకు మందుల పెట్టుబడే తడిసి మోపైడైంది. ఇక అవసరమైన సమయంలో తడులు అందకపోతే పంటలు ఎండితే పరిస్థితి ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే పెద్దపల్లి మండలం నిట్టూరు, తదితర గ్రామాల్లో పొలాలు బీటలు కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే పంటలు చేతికందడం ప్రశ్నార్థకమని అన్నదాతలు అంటున్నారు.

అనధికార 'కోత'లు

వ్యవసాయ రంగానికి నిరంతర విద్యుత్ ఇస్తున్నామని చెప్పిన పాలకుల మాటలకు.. వాస్తవాలకు పొంతనే కనిపించడం లేదు. ఉన్నతాధికారుల నుంచి వచ్చే సమాచారాన్ని బట్టే విద్యుత్ సరఫరా అమలు చేయాల్సి వస్తోందని కింది స్థాయి సిబ్బంది పేర్కొంటున్నారు. గ్రామస్థాయిలో ఉన్న వాట్సాప్ గ్రూప్‌లో ఆ సమాచారాన్ని అందిస్తున్నామని పేర్కొంటున్నారు. వారం రోజులుగా ఒక్కో రోజు ఒక్కో సమయంలో కోత పెట్టడం, సరఫరా చేయడం.. అర్ధరాత్రి ఒంటిగంట తర్వాత కూడా సరఫరా చేసిన సందర్భాలున్నాయని వివరించారు.

కాల్‌సెంటర్ ఏర్పాటు చేశాం..



విద్యుత్ ఉత్పత్తిలో కలిగే అంతరాయాల కారణంగానే ఈ పరిస్థితి కలిగి ఉండొచ్చు. వీలైనంత త్వరగా వ్యవసాయ రంగానికి అవసరమైన విద్యుత్‌ను అందించేలా చర్యలు తీసుకుంటాం. కోతలు విధించే సమయం ఉన్నతాధికారుల నుంచి అందుతుండడంతోనే కొంత ఇబ్బంది కలుగుతోంది. ఇబ్బందులు పడే రైతుల కోసం కాల్ సెంటర్ ఏర్పాటు చేశాం. సెల్ నెంబరు 7901628367 కు సమాచారమందిస్తే స్పందిస్తాం. – సుదర్శన్ , ఎస్ఈ పెద్దపల్లి

క్లుప్తంగా

రాములోరి కల్యాణానికి తలంబ్రాలు అందజేత


గోటితో వడ్లను ఒలిచి సిద్ధం చేసిన తలంబ్రాలు

రామగుండం: భద్రాచలంలో మార్చి 30న శ్రీసీతారాముల ఆలయంలో నిర్వహించే స్వామివారి కల్యాణానికి అక్షింతల(తలంబ్రాలు)ను రామభక్తులు ఇప్పటి నుంచే సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా అంతర్గాం మండలం పొట్యాల గ్రామానికి చెందిన పలువురు మహిళలు వడ్లను గోటితో ఒలిచి తలంబ్రాలను సిద్ధం చేసి పూజలు చేసి గోలివాడ చంద్రకళ చేతుల మీదుగా రామదాసు భక్తుడు మేడి తిరుపతికి అందజేశారు. తలంబ్రాలను సిద్ధం చేసిన వారిలో పొట్యాల సర్పంచ్ ఎదులాపురం నీరజ, గ్రామ కార్యదర్శి గంగాలక్ష్మి, వైష్ణవి, శ్యామల, రాధ, వాసవి, భాగ్యలక్ష్మి, దర్శన తదితరులున్నారు.

తల్వార్ తిప్పిన ఇద్దరిపై కేసు

గోదావరిఖని(రామగుండం): రౌడీషీటర్ మంథని సుమన్ శవయాత్రలో తల్వార్ తిప్పిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు గోదావరిఖని వన్‌టౌన్ సీఐలు రమేష్‌బాబు, ప్రసాద్‌రావు ప్రకటనలో తెలిపారు. పొడవాటి కత్తిని తిప్పుతూ రోడ్లపై వెళ్తున్న ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేసిన స్థానిక అంబేడ్కర్‌నగర్‌కు చెందిన ఎండీ జాకీర్, రాంనగర్‌కు చెందిన మారంగుల రమేష్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు వెల్లడించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటివారినైనా ఊరుకునేది లేదని హెచ్చరించారు.

చికిత్సపొందుతూ బాలిక మృతి


నిత్య(ఫైల్)

మంథని: మంథని మండలం పోతారం (ప్రస్తుతం నాగారంలో నివాసం)కు చెందిన వడ్లే నిత్య (14) గత నెల 22న పురుగుల మందు తాగగా, చికిత్స పొందుతూ 30న రాత్రి మృతిచెందినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఎస్సై వివరాలు.. నిత్య మైనార్టీ వెల్ఫేర్ రెసిడెన్సియల్ పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. గత నెల 11 నుంచి 23 వరకు సంక్రాంతి సెలవులు ఇచ్చారు. సెలవులకు ఇంటికి వచ్చిన నిత్య తిరిగి 23న వసతి గృహానికి వెళ్లాల్సి ఉంది. కానీ తాను హాస్టల్‌కు వెళ్లనని 22న తల్లితో గొడవపడింది. వెళ్లాలని తల్లి మందలించడంతో ఆ విషయాన్ని మనసులో పెట్టుకొని అదే రోజు వారు నివాసముండే ఇంటి పక్కన గల బాతురూంలోకి వెళ్లి పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు మంథని ఆస్పత్రి తర్వాత హైదరాబాద్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

యూనిట్లు తక్కువ..
దరఖాస్తులు ఎక్కువ..!

- మైనార్టీ రుణాలకు పోటాపోటీ..!
- 52 యూనిట్లు.. 3,088 మంది దరఖాస్తు
- అభ్యర్థుల్లో వ్యక్తమవుతున్న అసంతృప్తి
- మరిన్ని యూనిట్లు పెంచాలంటూ విజ్ఞప్తి



సుల్తానాబాద్: మైనార్టీలకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ కార్పొరేషన్ నుంచి అందిస్తున్న రుణాలకు దరఖాస్తులు ఆహ్వానించింది. ముందుగా ఈనెల ఐదో తేదీ వరకే గడువు ఉండగా 19 వరకు పొడిగించింది. రూ.లక్ష యూనిట్లు 36, రూ.2లక్షల యూనిట్లు 16 కేటాయించారు. దీంతో జిల్లాలోని మైనార్టీ అభ్యర్థులకు భారీగా దరఖాస్తు చేసుకున్నారు. రూ.లక్ష యూనిట్లు 36కుగాను 1,700 మంది దరఖాస్తు చేసుకున్నారు. అలాగే రూ.రెండు లక్షల యూనిట్లకు 1,388 దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా మైనార్టీల అధికారి మెరాజ్ తెలిపారు. పోటీ తీవ్రం కావడంతో అభ్యర్థులు అధికార పార్టీ నాయకుల మెప్పుకోసం పైరవీలు చేస్తున్నారు.

దరఖాస్తులు ఇలా..

మైనార్టీ రుణాలకు జిల్లా మొత్తంగా కేవలం 52 యూనిట్లు మాత్రమే మంజూరు చేయడంతో దరఖాస్తుదారుల్లో పోటీ తీవ్రమయ్యే అవకాశం ఉంది. ముస్లింలు, క్రైస్తవులు, బౌద్ధులు, జైనులు, పార్శీలు, సిక్కులు అత్యధికంగా గోదావరిఖనిలోనే ఉన్నారు. కేటాయించిన యూనిట్లు వీరికి ఏ మూలకు సరిపోవు. జిల్లాలో 266 గ్రామపంచాయతీలు, రామగుండం కార్పొరేషన్, పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీలుగా ఉన్నాయి. అయితే ప్రభుత్వం గ్రామ పంచాయతీలతోపాటు మున్సిపాలిటీలకు వేరువేరుగా యూనిట్లు కేటాయిస్తే వాటి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉండేదన్న వాదన వినిపిస్తోంది. తాజాగా మంజూరైన యూనిట్లకు.. వచ్చిన దరఖాస్తులతో పోల్చితే ఒక్కో యూనిట్‌కు దాదాపు 60 మంది చొప్పున పోటీ పడుతున్నారు. జిల్లాలో మైనార్టీల జనాభా 2011 ప్రకారం 48,195 అని, ఆ లెక్క ప్రకారమే ప్రభుత్వం యూనిట్లు మంజూరు చేసిందని అధికారులు పేర్కొంటున్నారు. అయితే ఏటా ఇవ్వాల్సిన రాయితీ రుణాలను ప్రభుత్వం మూడేళ్లుగా ఇవ్వలేదు. కేవలం 2020–21లో డ్రైవర్ ఎంపవర్‌మెంట్ పథకం కింద 11 మందికి మాత్రమే రుణాలిచ్చింది.

రాయితీ ఇలా..

రూ.లక్ష కేటగిరీ–1లో 59 రకాల యూనిట్లకు రూ.లక్ష చొప్పున రుణం మంజూరు చేస్తారు. ఇందులో 80 శాతం రాయితీ ఉంటుంది. కేటగిరి–2లో 25 రకాల యూనిట్లు ఉంటాయి. ఒక్కో యూనిట్‌కు రూ.రెండు లక్షల రుణం మంజూరు చేస్తారు. ఇందులో 70 శాతం రాయితీ వర్తిస్తుంది.

గతంలో తీసుకున్న వారు అనర్హులు



మైనార్టీ కార్పొరేషన్ నుంచి గతంలో రుణాలు తీసుకున్న వారు అనర్హులు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తున్నాం. ఇంటర్వ్యూలకు ఉన్నతాధికారుల ఆదేశం మేరకు తేదీలు ప్రకటిస్తాం. యూనిట్ల సంఖ్య పెంచాలని విజ్ఞప్తులు వస్తున్నాయి. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతాం.

– మెరాజ్, డీఎండబ్ల్యూఓ

యూనిట్ల సంఖ్య పెంచాలి



ప్రభుత్వం మైనారిటీల అభివృద్ధికి యూనిట్లను మంజూరు చేయడం శుభ పరిణామం. అయితే తక్కువ యూనిట్లు మంజూరు చేయడం ద్వారా చాలామంది నిరుద్యోగులు నిరాశకు గురవుతున్నారు. మైనార్టీల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని యూనిట్ల సంఖ్య పెంచి నిరుద్యోగులను ఆదుకోవాలి.

– హకీం, మైనార్టీ నాయకుడు, సుల్తానాబాద్

విద్యార్థులు ప్రణాళికతో ముందుకెళ్లాలి


మాట్లాడుతున్న సుహాసిని

గోదావరిఖనిటౌన్(రామగుండం): విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళికతో ముందుకెళ్లాలని మాజీ ఆర్‌జేడీ (ప్రాంతీయ సంచాలకులు–వరంగల్) సుహాసిని పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాలలో ఇంటర్ విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత విద్యాసంవత్సరం కరోనా సమయంలో 10వ తరగతి, ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు తరగతులకు గైర్హాజరు అయ్యారని, ప్రస్తుతం వారిలో పరీక్షలపై ఆందోళన నెలకొందని, ముఖ్యంగా సెకండియర్ విద్యార్థులు ఎలా ప్రిపేర్ అవ్వాలని ఆందోళన చెందుతున్నారని అన్నారు. విద్యార్థుల సమస్యలను గుర్తించి మంచిర్యాల విద్యార్థి సంఘం నాయకుడు కల్వల శరత్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం ప్రైవేటు కంటే ప్రభుత్వ కళాశాలల్లోనే విద్యార్థులు అధిక సంఖ్యలో చేరుతున్నారని, దీనికి నిదర్శనం ప్రైవేట్ కళాశాలల సంఖ్య తగ్గుముఖం పట్టడమేనని అన్నారు. ప్రభుత్వ కాలేజీల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని గుర్తుచేశారు. కళాశాలలో విద్యాభ్యాసం ముగిసిన ప్రతీ విద్యార్థి మరో విద్యార్థిని చేర్పించే బాధ్యత తీసుకొని ఈచ్ వన్ క్యాచ్ వన్ అనే విధానాన్ని పాటించాలని కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర కళాశాల ప్రిన్సిపాల్ మాధవి, అధ్యాపకులు దామెర శంకర్, శ్రీధర్, రాజలింగం, నాయకులు రాసపెల్లి రవికుమార్, కల్వల ప్రదీప్, పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సీపీని కలిసిన ఆర్జీ–1 జీఎం


సీపీకి మొక్క అందజేస్తున్న జీఎం నారాయణ

గోదావరిఖని(రామగుండం): రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరిని మంగళవారం ఆర్జీ–1 జీఎం కె.నారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా శాలువాతో సన్మానించి మొక్క అందజేశారు. కోల్‌బెల్ట్‌లో శాంతి భద్రతల విషయంలో సహకరించాలని కోరారు. జీఎం వెంట సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి ఉన్నారు.

విలీనం చేసి అభివృద్ధి మరిచారు


ప్రజలను పలుకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే విజయ్

పెద్దపల్లిరూరల్: పంచాయతీగా ఉన్న చందపల్లిని మున్సిపాలిటీలో విలీనం చేసి అభివృద్ధి మాత్రం చేయడం లేదని మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు ఆరోపించారు. మున్సిపల్ పరిధిలోని 15, 16, 17వార్డుల్లో మంగళవారం గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇచ్చిన ప్రొసిడింగ్స్ వాపస్ తీసుకుని డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామన్న ఎమ్మెల్యే హామీ అమలు కావడం లేదన్నారు. కొత్త వార్డుల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. కౌన్సిలర్ నెత్తెట్ల స్వరూప, మల్లయ్య, నాయకులు శ్రీనివాస్, భారతి, సురేశ్‌గౌడ్, ఈర్ల స్వరూప, కొలిపాక శోభ తదితరులున్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం అందుగులపల్లి గ్రామానికి చెందిన పెంజర్ల రాయమల్లమ్మ (57) మంగళవారం విద్యుదాఘాతానికి గురై మరణించింది. స్థానికుల వివరాలు.. ఇంటి ఆవరణలో బావికి అమర్చిన విద్యుత్ మోటార్ వైరు ఊడిపోవడంతో విద్యుత్ సరఫరా అవుతున్న వైరుకు తాకగా, షాక్‌కు గురైన రాయమల్లమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి భర్త గతంలోనే మరణించగా బుద్ధిమాంద్యం గల కూతురు స్వరూప ఉంది.

రెండు మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలు ఖరారు

- మంథనికి ఎక్కేటి అనంతరెడ్డి
- కమాన్‌పూర్‌కు దాసరి రాజలింగు


అనంతరెడ్డి


దాసరి రాజలింగు

మంథని: నియోజకవర్గంలోని మంథని, కమాన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీలకు నూతన పాలకవర్గాలను ప్రభుత్వం ఖరారు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. నియోజకవర్గంలో తొమ్మిది మండలాలకుగాను మంథని, కాటారం, కమాన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. ఇందులో మంథని, కమాన్‌పూర్‌కు పాలకవర్గాలను ప్రకటించిన ప్రభుత్వం.. కాటారాన్ని మాత్రం పెండింగ్‌లో పెట్టింది. వారం రోజుల్లో ఈ కమిటీకి కూడా ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉన్నట్లు బీఆర్‌ఎస్ వర్గాలు తెలిపాయి. మంథని వ్యవసాయ మార్కెట్ కమిటికి చైర్మన్‌గా ఎక్కేటి అనంతరెడ్డి, కమాన్‌పూర్‌కు దాసరి రాజలింగును నియమించారు. అలాగే మంథని వైస్ చైర్మన్‌గా పుట్టపాక శ్రీనివాస్, సభ్యులుగా లంబు ప్రభాకర్‌రెడ్డి, గొబ్బూరి వంశీ, ఎండీ.ముక్యాతర్ అహ్మద్, బోయిని రాజయ్య, వేల్పుల గట్టయ్య, దేవరనేని రాజేశ్వర్‌రావు, జంజర్ల లింగయ్య, ఉడుత లింగయ్య, ఎడ్ల సమ్మయ్య, ఆజ్మీరా సమ్మయ్య, వొల్లాల లింగమూర్తి, మల్యాల బాపు, కమాన్‌పూర్ వైస్ చైర్మన్‌గా గుర్రం లక్ష్మిమల్లు, సభ్యులుగా పెండ్లి నారాయణ, వొడ్నాల రాజు, ఇల్లందుల అశోక్, పప్పు చంద్రమౌళి, కూరాకుల ఓదెలు, సుంకరి మహేందర్, బెడ సంపత్, అనవేన వేణు, బొల్లంపల్లి రమేశ్, మైదం స్వప్న, కోలేటి సత్తయ్య, వంగల లింగారెడ్డిని నియమించారు.

పోటీ పరీక్షల్లో సత్తా చూపాలి


పుస్తకాలు అందిస్తున్న అధికారులు

పెద్దపల్లిరూరల్: పోటీ పరీక్షలకు (గ్రూప్ 3, 4) హాజరవుతున్న బీసీ విద్యార్థులు సత్తా చాటాలని బీసీ వెల్ఫేర్ అధికారి వినోద్‌కుమార్ అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆవరణలో మంగళవారం ఉచిత శిక్షణ పొందిన విద్యార్థులకు పుస్తకాలు అందించారు. పుస్తకాల్లోని సమాచారం ఎంతో విలువైందని, శిక్షణ కాలంలో నేర్చుకున్న అంశాలతోపాటు బాగా చదివి ఉద్యోగం సాధించుకోవాలని సూచించారు. అయితే హాజరైన విద్యార్థులందరికీ సరిపడా పుస్తకాలు అందకపోవడంతో నిరసన వ్యక్తం చేశారు. హాజరు శాతం ప్రకారం పుస్తకాలు తెప్పించామని, మరిన్ని సెట్లు రాగానే అందిస్తామని అధికారులు నచ్చజెప్పారు. కార్యక్రమంలో నాగరాజు, అశోక్, అంజయ్య తదితరులున్నారు.

సైన్స్ ప్రదర్శనలో జిల్లా ప్రాజెక్టు


విద్యార్థిని అభినందిస్తున్న అధికారులు

పెద్దపల్లి రూరల్: గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్ వేదికగా ఐదు రోజులుగా నిర్వహించిన 30వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో జిల్లా విద్యార్థిని ప్రదర్శించిన ప్రాజెక్ట్ ఆకట్టుకుందని డీఈవో డి.మాధవి తెలిపారు. జనవరి 27 నుంచి 31వరకు జరిగిన ప్రదర్శనలో గోదావరిఖనిలోని జెడ్పీ ఉన్నత పాఠశాల (బాలికలు)లో 9వ తరగతి విద్యార్థిని అప్సియానాసుల్తానా ఎన్‌సీఎస్‌సీ జాతీయ ఎగ్జిబిషన్‌లో భాగంగా 'ఓవర్ కమింగ్ ఆఫ్ పికా డిజార్డర్ ఈటింగ్ స్లేట్ పెన్సిల్' పై రూపొందించిన ప్రాజెక్టు ఆకట్టుకుందన్నారు. విద్యార్థినిని డీఈవో అభినందించారు.

నేటి నుంచి సాక్షి ప్రీమియర్ లీగ్ సీజన్ –4

- ప్రారంభించనున్న మంత్రి గంగుల కమలాకర్
- జూనియర్స్, సీనియర్స్ విభాగంలో మ్యాచ్‌లు

కరీంనగర్‌స్పోర్ట్స్: సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో బుధవారం నుంచి సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) సీజన్–4 ప్రారంభం కానుంది. తెలంగాణలోని ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో జూనియర్, సీనియర్స్ కేటగిరీలలో క్రికెట్ పోటీలు నిర్వహించేందుకు సిద్ధమైంది. తిమ్మాపూర్‌లోని జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో మ్యాచ్‌లు జరుగనుండగా, ఉదయం పోటీలను రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ లాంఛనంగా ప్రారంభించనున్నారు. కాగా ప్రతి రోజూ ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోటీలు జరుగనున్నాయి. పోటీలకు హాజరయ్యే జట్లు ముందుగా నిర్వాహకులు సూచించిన షెడ్యూల్ ప్రకారం హాజరుకావాలి. కరోనా దృష్ట్యా క్రీడాకారులు అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ కోవిడ్ నిబంధనలు పాటించాలని నిర్వాహకులు తెలిపారు. కాగా ఎస్‌పీఎల్ సీజన్‌- 4కు సుధాకర్ పైప్స్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నారు.

నియమ నిబంధనలు..

- ఆయా కళాశాలల జట్లు తమ మ్యాచ్‌లు సూచించిన సమయానికి, మ్యాచ్ జరిగే తేదీన గంట ముందు నిర్వాహకులకు రిపోర్టు చేయాల్సి ఉంటుంది.
- మ్యాచ్ సమయంలో ఇరు జట్ల క్రీడాకారులు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు సంబంధించిన పదో తరగతి మార్కుల మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు చూపించాలి.
- క్రీడాకారులు సొంత కిట్‌ను వెంట తెచ్చుకోవాలి. మ్యాచ్‌లలో పాల్గొనే క్రీడాకారులు వైట్ డ్రెస్ తప్పనిసరిగా ధరించాలి. వైట్ డ్రెస్ లేనివారు మ్యాచ్‌లు ఆడేందుకు అనర్హులు.
- మ్యాచ్ జరిగే సమయంలో బ్యాట్స్‌మెన్, వికెట్ కీపర్ తప్పని సరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్‌గార్డ్స్, హ్యాండ్ గ్లౌజ్స్ ధరించాలి.
- ఒక కళాశాల జట్టు తరుపున ఆడి మళ్లీ ఇతర కళాశాలకు ఆడరాదు. అలా ఆడితే ఆ కళాశాల జట్టును టోర్నమెంట్ నుంచి తొలగించడం జరుగుతుంది.
- ఎస్‌పీఎల్ సీజన్–4కు సంబంధించిన తుది నిర్ణయం నిర్వాహకులదే.

సింగరేణి వార్తలు

ఐక్య ఉద్యమాలతోనే సింగరేణి పరిరక్షణ

- ఐఎఫ్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేశ్


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రామగిరి(మంథని): సింగరేణి పరిరక్షణ కార్మిక సంఘాల ఐక్య ఉద్యమాలతోనే సాధ్యమవుతుందని తెలంగాణ గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం(ఐఎఫ్టీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేశ్ పేర్కొన్నారు. సెంటినరీకాలనీలోని యూనియన్ కార్యాలయంలో మంగళవారం 11వ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. బొగ్గు పరిశ్రమలు కార్పొరేట్ శక్తుల ఆధిపత్యంలోకి వెళ్లాయని, ప్రభుత్వ రంగంలో ఉన్న సదుపాయాలు, హక్కులు ప్రైవేట్ కంపెనీల భాగస్వామ్యంలో కుదరవని తెలిపారు. దీంతో పని గంటలు, పని భారం పెరగడంతో పాటు ప్రస్తుతం అనుభవిస్తున్న హక్కులు కూడా ఉండవని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సింగరేణిలో అనేక పోరాటాలు, ఉద్యమాలు నిర్మించామని, బలమైన ఐక్య కార్మిక ఉద్యమం సంఘటితంగా నిర్మాణయుతంగా కొనసాగితే ప్రైవేటీకరణను అడ్డుకోవచ్చని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం అసంఘటిత రంగంలో సింగరేణి కాంట్రాక్టు కార్మికుల జీతభత్యాల పెంపుదల, ప్రభుత్వ జీవోలను అమలు పరచడం లేదని, దీంతో కాంట్రాక్ట్ కార్మికుల జీవితాలు అతి దుర్భరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్, పర్మినెంట్ కార్మికులు ఐక్యంగా పోరాడాలని కోరారు. ఈనెల 4న గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించనున్న 11వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.వెంకన్న, నాయకులు రాయమల్లు, మొగిలి, మనోజ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన అధికారులకు సన్మానం


సన్మానిస్తున్న జీఎం మనోహర్


గోదావరిఖని(రామగుండం): ఆర్జీ–2 ఏరియాలో విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన అధికారులను మంగళవారం ఆర్జీ–2 జీఎం ఘనంగా సన్మానించారు. సర్వే అధికారిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ప్రసాదరావు, సీనియర్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగ విరమణ పొందిన జగన్మోహన్‌రెడ్డిలను శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, ఎస్‌ఓటూ జీఎం అబ్దుల్‌సలీం, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

దేహ, అవయవ దానానికి అంగీకారం

ఉద్యోగ విరమణ రోజే అవయవ, దేహ దానం చేసేందుకు అంగీకరించి ఆదర్శంగా నిలిచారు. ఆర్జీ–2 ఏరియాలో సీనియర్ సెక్యూరిటీ అధికారిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణపొందిన ముస్కుల జగన్మోహన్‌రెడ్డి అంగీకార పత్రాలపై సంతకం చేసి సదాశయ ఫౌండేషన్‌కు అందజేశారు. ఈసందర్భంగా జీఎం మనోహర్ వీరిని అభినందించారు. కార్యక్రమంలో సదాశయ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తి లక్ష్యాల సాధనలో దూకుడుగా ముందుకు

- ఆర్జీ–1 జీఎం కె.నారాయణ


మాట్లాడుతున్న జీఎం కె.నారాయణ

గోదావరిఖని(రామగుండం): వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనలో దూకుడుగా ముందుకెళ్తున్నామని ఆర్జీ–1 జీఎం కె.నారాయణ పేర్కొన్నారు. మంగళవారం జీఎం కార్యాలయంలోని తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈఆర్థిక సంవత్సరంలో జనవరి చివరినాటికి 31.71లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికిగాను 36.59 లక్షల టన్నుల ఉత్పత్తి సాధించి నిర్దేశిత లక్ష్యాల సాధనలో 115 శాతంలో నిలిచినట్లు వెల్లడించారు. ఉత్పత్తితో పాటు సంక్షేమంలో కూడా రాజీలేకుండా ముందుకు సాగుతున్నామన్నారు. వ్యర్థ జలాల శుద్ధి కోసం సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ భూమిపూజ పూర్తి చేసి నిర్మాణ పనులు ఊపందుకున్నాయని, మరో రెండేళ్లలో పనులు పూర్తి కానున్నాయని వివరించారు. గోదావరినదిలోని నీటిని శుద్ధి చేసేందుకు నదిలో ఏర్పాటు చేసిన ఇంటెక్‌వెల్‌లను శుభ్రం చేస్తున్నామని, మరో 15రోజుల పాటు ఈప్రక్రియ కొనసాగుతుందన్నారు. ప్రత్యేక నిపుణులను రప్పించి మరమ్మతులు కొనసాగిస్తున్నామని, నీటి సరఫరా కొనసాగిస్తూనే మరమ్మతులు చేపడుతున్నామని పేర్కొన్నారు. జీడీకే–5 ఓసీపీ సమీప గ్రామాలకు దుమ్ము సమస్య లేకుండా చర్యలు చేపట్టామని, పూర్తయ్యేసరికి కొంత సమయం పడుతుందన్నారు. సమావేశంలో ఎస్‌ఓటూ జీఎం రామ్మోహన్, అధికారులు రామ్మూర్తి, రామక్రిష్ణ, చిలక శ్రీనివాస్, సైదులు, కిరణ్‌రాజ్‌కుమార్, నవీన్, ఆంజనేయులు, ఆంజనేయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జీడీకే–5 ఓసీపీని సందర్శించనున్న డీడీఎంఎస్‌లు

గోదావరిఖని(రామగుండం): జీడీకే–5 ఓసీపీ బ్లాస్టింగ్‌ల మూలంగా ఏర్పడుతున్న ఇబ్బందులపై డీడీఎంఎస్‌లు సనత్‌కుమార్, కమలేష్‌కుమార్‌శర్మ బుధవారం సదరు ప్రాంతాన్ని సందర్శించనున్నారు. బ్లాస్టింగ్ సమయంలో వైబ్రేషన్స్ తనిఖీ చేయనున్నట్లు 11వ డివిజన్ కార్పొరేటర్ పెద్దెల్లి తేజస్విని తెలిపారు. బ్లాస్టింగ్‌లతో ప్రజలు ఇళ్లలో ఉండలేని పరిస్థితి ఏర్పడుతుందని, ఇళ్లు దెబ్బ తింటున్నాయని ఇచ్చిన ఫిర్యాదు మేరకు వాస్తవాలు పరిశీలించడానికి ఇక్కడకు వస్తున్నారని కార్పొరేటర్ వెల్లడించారు.

ఆర్‌వీఆర్ కంపెనీలో ప్రమాదం


ప్రమాద దృశ్యం

గోదావరిఖని(రామగుండం): సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–2 పరిధిలోని ఆర్‌వీఆర్ ప్రైవేట్ ఓబీ కంపెనీలో ప్రమాదం జరిగి కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం రాత్రిషిఫ్టులో ముందుగా వెళ్తున్న వోల్వో వాహనాన్ని వెనకాలే వెళ్తున్న వాహనం ఢీకొనడంతో రాకేష్ అనే డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. రెండు వాహనాల మధ్య డ్రైవర్ ఇరుక్కోవడంతో కాలు మడమ భాగం వరకు కట్ అయ్యింది. తీవ్ర రక్తస్రావం కావడంతో హుటాహుటిన చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. కాలు భాగం మడమ వరకు తొలగించే అవకాశం ఉందని వైద్యులు పేర్కొంటున్నారు.

ఖేలో ఇండియా కబడ్డీ పోటీలకు సాయిప్రియ



కరీంనగర్‌స్పోర్ట్స్: మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఈనెల 5 నుంచి 8వ తేదీ వరకు జరుగనున్న ఖేలో ఇండియా కబడ్డీ పోటీలకు కరీంనగర్‌లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్న జి.సాయిప్రియ ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ టి.శ్రీలక్ష్మి తెలిపారు. ప్రస్తుతం సాయిప్రియ హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ఖేలో ఇండియా జట్టు శిక్షణ శిబిరంలో శిక్షణ పొందుతుంది. ఈ సందర్భంగా విద్యార్థిని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ పి.శ్రీధర్‌రావుతో పాటు అరుణ, స్వరూప, వెంకటరమణ, సతీష్‌కుమార్ అభినందించారు.